


## పాత్రలు

| | |
|---|---|
| శంకరం | అబ్బాయి తల్లి |
| పత్రికా సంపాదకుడు | లాయరు |
| అమ్మాయి | జడ్జి |
| అబ్బాయి | సీత |
| అమ్మాయి తల్లి | వ్యక్తి |
| అమ్మాయి తండ్రి | గిరిజ |
| అబ్బాయి తండ్రి | రాజారావ్ |



(ఇందులో ఒకే పాత్రధారి— రెండుగానీ, అంతకు మించిగానీ పాత్రల్లో కన్పించవచ్చు. ఉదాహరణకు—అమ్మాయి, సీత, గిరిజ పాత్రల్ని ఒకే పాత్రధారి పోషించవచ్చు. అలాగే పత్రికా సంపాదకుడు, జడ్జి, వ్యక్తి పాత్రల్లో ఒకే పాత్రధారి కనిపించవచ్చు. పాత్రధారులంతా మైమ్ (భ్రమ) చేయవలసిన అవసరం కూడా ఉంటుంది.)

(ఇంకా తెర తీయలేదు. అయినా స్టేజి లోపల ఎవరో ఇద్దరు వ్యక్తులు ఘర్షణ పడుతున్నట్టుగా — ఆడిటోరియంలో ప్రేక్షకులకు వినిపిస్తోంది.

ఒక గొంతు : మీ రలా కోప్పడితే నేనేం చేయలేను, సార్ ... క్షమార్పణ కోరుకుంటున్నానుగా!

రెండవ గొంతు : ఇంత జరిగిం తర్వాత— ఇప్పుడు నాటకం వెయ్యలేం— అంటే ఎలాగయ్యా?

ఒకటో గొంతు : ఏం చెయ్యమంటారు చెప్పండి. నాటకంలో హీరో వేషం వేస్తున్న అర్జున్‌రావుకి ఇవాళ పొద్దున్న స్కూటర్ యాక్సిడెంటులో కాలు విరిగింది. ఆస్పత్రిలో ఉన్నాడు. ఇదే పరిస్థితిలో మీరుంటే ...

రెండో గొంతు : ( కోపంగా ) అంటే ... ఏమిటయ్యా నీ ఉద్దేశ్యం? నాకు యాక్సిడెంటయి, నా కాలు విరిగి నేను ఆస్పత్రిలో చేరాలనా?

ఒకటో గొంతు : అదికా ద్సార్! మానవతా దృక్పథంతో ఆలోచించమంటున్నాను.

రెండో గొంతు : కుదరదయ్యా! అవతల డొనేషన్లు వసూలుచేశాం. ఇన్విటేషన్లు పంచిపెట్టాం. ఈ చివరి నిమిషంలో వచ్చి నాటకం కేన్సిల్ చేయమంటే నా వల్ల కాదు.

ఒకటో గొంతు : ఏమండీ ... నా మాట వినండీ ... ప్లీజ్ ...

(అంటూ అతను స్టేజిమీద కుడివైపు నుంచి ఎడం వైపు ఆత్రంగా, ఆందోళనగా ఎవరినో వెంబడిస్తున్నట్టుగా నడుస్తూంటే ... తెర పూర్తిగా తొలగింది.)

శంకరం : ( "మిమ్మల్నేనండీ ... ప్లీజ్" అంటూ స్టేజి ఎడంవైపు చివరిదాకా వెళ్ళి నిస్సహాయంగా వెనుతిరిగి, తెర తొలగి ఉండటం గమనించి ప్రేక్షకుల్ని చూసి కొంచెం ఖంగారుపడి, మళ్ళీ అంతలోనే సర్దుకుని, ముందు కొచ్చి ) న... నమస్కారం. క్షమించాలి. మిమ్మల్ని గమనించలేదు! (కుడివైపుచూస్తూ) ఎవరయ్యా కర్టెన్ లాగిందీ? బుద్ధుండక్కల్లే?... తెర తీసేముందు నాకు చెప్పద్దూ? ( మళ్ళీ ప్రేక్షకుల వైపు తిరిగి వినయంగా ) మీకు కలిగిన ఈ సౌకర్యానికి మన్నించ వలసిందిగా కోరుకుంటున్నాను. వృత్తి రీత్యా నే నొక పత్రికా విలేఖర్ని. నాటకరంగం అంటే నాకు ఆరో ప్రాణం. ఆ మాటకొస్తే పూర్వాశ్రమంలో నేను చాలా నాటకాలు వ్రాశాను. వేశాను. మళ్ళీ ఇప్పుడు ... చాలాకాలం తర్వాత వో నాటకం ఆడాలని బుద్ధి పుట్టింది. పది రోజుల్నించీ రిహార్సల్స్ గట్టిగానే పడ్డాయి. కానీ, దురదృష్టం ... ఈ నాటకంలో హీరోవేషం వేయాల్సిన అర్జున్‌రావ్‌కి కాలు విరిగి ఆస్పత్రిలో చేరాడు. ఆ విషయం ఆర్గనైజరుగారితో చెప్పి, క్షమాపణ కోరుకుందామని వచ్చాను కానీ, వా మాట వినకుండా — ఇలా తెర తీసేసి మీ ముందు నన్నో దోషిలా, ద్రోహిలా నిలబెట్టాలని ప్రయత్నించాడు! ఐ డోంట్ మైండ్! మిమ్మల్ని నిరాశ పరచకుండా నాటిక ప్రదర్శిస్తాను! ( సైడు వింగ్‌లోకి చూస్తూ ) నాటిక పేరేమిటయ్యా? ( అవతలి నించి వినిపించింది— ("వన్ యాక్ట్ ప్లే") యస్! "వన్ యాక్ట్ ప్లే ..." కానీ నేను ప్రదర్శించబోయేది "వన్ ఫాక్ట్ ప్లే!" బై దీ బై ... నేను విలేఖరినని ఇంతకుముందే చెప్పాను. పత్రిక పేరు ... ఎందుకులెండి! పత్రికపేరు చెప్పుకుని పేరు ప్రతిష్ఠలు సంపాదించుకోవటం అంటే— చెట్టు పేరు చెప్పి కాయ లమ్ముకోవటం వంటిదని మా ఎడిటర్ గారు పదే పదే అంటూంటారు! ఏమాట కామాటే చెప్పాలి. మా ఎడిటర్‌గారు చాలా సిన్సియర్! కమిటెడ్ జర్నలిస్ట్! నిన్న పొద్దున్న నేను ఆఫీసుకివెళ్ళ గానే ఆయన నన్ను పిలిచి, వో డోస్ ఇచ్చారు.

( కుడివైపునుంచి ఎడిటర్ వచ్చి కుర్చీలో కూర్చుని బల్లమీదున్న

పేపర్ని చూశాడు. )

ఎడిటర్ : ( వో పేపరు చూస్తూ ) శంకరం! శంకరం!

శంకరం : ( ఎడమవైపునుంచి శంకరం వచ్చాడు ) ఏం, సార్?

ఎడిటర్ : ( పేపరు చూపిస్తూ ) ఏమిటయ్యా ఈ వార్త? ఎక్కడో ఆముదాల వలసలో ఆవదం చెట్టుకి చింతకాయ కాస్తే — జనం తండోప తండాలుగా వెళ్ళి ఆ వింత చూస్తున్నారా? ఎందుకయ్యా ఇలాంటి వార్తలు?

శంకరం : అది కాదు, సార్ ...

ఎడిటర్ : ను వ్వింకేం చెప్పకు! ఎప్పుడు తెచ్చినా వాణ్ణి వీడు పొడిచాడనో, లేకపోతే ఎక్కడో మినిష్టర్ గారు రిబ్బన్ కత్తిరించారనో, పునాదిరాయి వేశారనో... ఇలాంటి రొటీన్ స్టఫ్ తప్ప — సెన్సేషనల్‌గా ఉండే న్యూస్ ఎప్పుడైనా తీసుకొచ్చావా? ( ఆ కాగితం చెత్త బుట్టలో పారేస్తూ ) వెళ్ళవయ్యా వెళ్ళు! దేశంలోకి వెళ్ళు. యధార్థ గాథల్ని తీసుకురా. కళ్ళకు కట్టేలా రాయి. సమాజంలో కుళ్ళుని తరిమికొట్టేయ్ ... పత్రిక్కి పేరు తీసుకురా! నువ్ పేరు తెచ్చుకో! వెళ్ళు. ( అంటూ వెళ్ళిపోయాడు. శంకరం బుర్ర గోక్కుంటూ, అటు ఇటు తిరిగి మళ్ళీ స్టేజిమీద ప్రేక్షకుల ముందు కొచ్చి నిలబడ్డాడు )

శంకరం : ఎడిటర్‌గా రిచ్చిన డోస్‌తో మూడంతా చెడిపోయింది. మళ్ళీ మూడ్ రావాలంటే ముకుందాన్ని కలుసుకోవాల్సిందే. వాడిచ్చే డోస్ చాలా బాగుంటుంది. అంతా ఫారెన్ సరుకు. కానీ ఎలా? వా డెక్కడో, మేడ్చల్‌లో ఉంటున్నాడు. అయినామూడ్ కావాలంటేవెళ్ళక తప్పదు. పత్రిక వారు ఇచ్చిన స్కూటరుందిగా? ఎక్కి కూర్చుంటే రెండు గంటల్లో అక్కడ ఉండచ్చు. వాడి ఏసీ గదిలో కూచుని, చిన్న మందు పుచ్చుకుని, చిట్టిబాబు వీణో, రవిశంకర్ సితారో — అదీ ఇదీ కాకపోతే కృష్ణశాస్త్రిగారి పాటలో వింటూ — కళ్ళు మూసుకుంటే, స్వర్గంలో విహరించచ్చు. అందుకే — ఆశగా అంతదూరం వెళ్ళేను...

( స్కూటర్ తీసి స్టార్ట్ చేశాడు. ఎక్కి కూర్చుని, స్టేజి మీద రెండు రవుండ్లు కొట్టేడు. చివరికి వో కార్నర్‌లో స్కూటర్ ఆపేసి క్రిందకు దిగేడు. గుమ్మం దగ్గరకు నడిచాడు. ఇదంతా మైమ్‌లోనే చెయ్యాలి.

శంకరం : ( తలుపుకి తగిలించి ఉన్న తాళం చూసి) మై గాడ్! ఇంటికి తాళం వేసి ఉందే! ముకుందం ఎక్కడికి పోయాడో! అయినా చెప్పాపెట్టకుండా రావటం నాదే తప్పు. ( టైం చూసుకుని ) అప్పుడే మూడయిపోయింది కొంపదీసి నేను వీడికోసం వస్తే, వీడు నా కోసం వెళ్ళలేదు కదా ( సైడ్ వింగ్‌లోకి చూస్తూ ) ఏవండీ ... మిమ్మల్నేనండీ ... ఇంట్లో ... ముకుందం ... అదే ... ముకుందంగారు ఎక్కడి కెళ్ళారో తెలుసా?

( సైడ్‌వింగ్ లోంచి గొంతు వినిపించింది )

గొంతు : హైదరాబాదు వెళ్ళారండీ ... రే పొస్తారు!

శంకరం : చచ్చాంరా దేవుడా! అనుకున్నంతా అయింది. పెట్రోలు దండగ. ( మళ్ళీ మైమ్‌లోనే స్కూటర్ స్టార్ట్ చేశాడు. స్టేజి మీద రవుండ్లు కొడుతున్నాడు. నేపథ్యంలో స్కూటరు వెడుతున్న శబ్దం వినిపిస్తోంది. అంతలో ... సైడ్‌వింగ్‌లోంచి వో అమ్మాయి ఖంగారుగా, భయంగా వచ్చి, శంకరం స్కూటరు కింద పడబోయి, తప్పించుకుంది. శంకరం బ్రేకువేసి, క్రిందకు దిగేడు. అప్పటికి ఆ అమ్మాయి లేచి, బట్టలు దులుపుకుంటోంది. )

శంకరం : ( ఆమెను చేరుకుని ) సారీ, దెబ్బ తగిలిందా?

అమ్మాయి : లేదు లెండి! ( అంటూ గబగబా వెళ్ళిపోతోంది. )

శంకరం : ( ఆలోచనగా ఆమెనే చూస్తూ ) అరె... అటువైపు ...అలా చెరువుగట్టు వైపు వెడుతోందేమిటీ? కొంపదీసి ... ( ఏదో ఆలోచన వచ్చిన వాడిలా, వెనకాలే పరుగెడుతూ ) ఏమండీ ... మిమ్మల్నే! ... ఏమ ండీ ... ( అ ంటూ చెయ్యి పట్టుకున్నాడు. )

అమ్మాయి : నన్నొదిలి పెట్టండి ... ( విడిపించుకునే ప్రయత్నం చేసింది )

శంకరం : భలేవారే ... మీరు ఆత్మహత్య చేసుకుంటూంటే, చూస్తూ వూరుకోమంటారా? అయినా ఆత్మహత్య మహా పాతకమండీ!

అమ్మాయి : ( నిరాశగా ) హు! ... బతకటం కూడా మహా పాతకమేనండీ!

శంకరం : నో! జీవితం జీవించటానికే గానీ, అర్ధాంతరంగా ముగించటానికి కాదు.

అమ్మాయి : జీవించాలని అందరికీ ఉంటుందండీ ... కానీ బ్రతకనిస్తేగా?

శంకరం : ఎవరు?

అమ్మాయి : అసలు మీ రెవరు?

శంకరం : సాటి మనిషిని!


అమ్మాయి : మనిషి ... మనిషి! ఛీ. . ఛీ ... ఈ మనుషుల మీదే నమ్మకం పోతోంది నాకు!

శంకరం : మనుషులంతా చెడ్డవాళ్ళు కారు! ... ( ఆమెను పరిశీలనగా చూసి ) అవునూ—చూడబోతే పెళ్ళి కూతురిలా కనిపిస్తున్నారు...

అమ్మాయి : అవును. పెళ్ళికూతుర్నే... కానీ పెళ్ళి కాలేదు.

శంకరం : అంటే ఇష్టంలేని పెళ్ళా?

అమ్మాయి : కాదు. ఆగిపోయిన పెళ్ళి. పెళ్ళి పీటల వరకూ వచ్చిన పెళ్ళి. మూడు ముళ్ళా పడకుండా ఆగిపోతే — ఆ అవమానం భరించలేక కన్న తండ్రి గుండాగి చచ్చిపోతే, ఇంక ఆ పెళ్ళి కూతురు ఏంచేస్తుందండీ? ఇంక ఆ కుటుంబానికి బరువై కన్న తల్లిని చూసినప్పుడల్లా, ఆవిడ




పసుపు కుంకుమలు చెరిగిపోవటానికి తానే చెడ పురుగు ననుకుంటూ ఏడుస్తూ కూర్చుంటుందా? ఏ నుయ్యో, గొయ్యో చూసుకుంటుందా? చెప్పండీ!

శంకరం : గుడ్! ఆవేశంలో కూడా అందంగా మాట్లాడుతున్నారు. ఇంతకీ ఆలోచించే ఈ నిర్ణయాని కొచ్చారా?


అమ్మాయి : ఇంకేముందండీ ఆలోచించటానికి? ( తప్పించుకు వెడుతూ ) నన్ను వెళ్ళనివ్వండి. నన్ను చావనివ్వండి!

శంకరం : ( చేతో వారిస్తూనే ) నో ... యస్...! తప్పకుండా చచ్చిపోదురు గాని! కానీ ముందుగా అసలేం జరిగిందో నాకు చెప్పండి. నాకు చేతనైన సహాయం నేను చేస్తాను ...

అమ్మాయి : మీరా?

శంకరం : అవును! నేను ఎలాంటి సహాయం మీకు చేయలేకపోతే మీ చావు మీరు చావచ్చు. కావాలంటే — నేనే మిమ్మల్ని స్వయంగా ఈ చెరువు లోకి తోసెయ్యగలను! (ఆగి)చెప్పండి ... ఏం జరిగిందో చెప్పండి...

( అమ్మాయి స్టేజి మధ్యంగా వస్తూంటే — నెమ్మదిగా లైట్స్ ఫేడవుట్ అయిపోయాయి. మళ్ళీ వెంటనే లైట్స్ ఫేడిన్ అయ్యేసరికి పెళ్ళి పీటల మీద వధువుగా అమ్మాయి కూర్చుని ఉంది. పక్కనే అబ్బాయి ఉన్నాడు. నేపథ్యంలో మంగళ వాద్యాలు పెళ్ళి మంత్రాలూ




వినిపిస్తున్నాయి. స్టేజిమీద — మరో మూల అబ్బాయి తండ్రి, అమ్మాయి తండ్రీ ఘర్షణ పడుతున్నారు. అబ్బాయి తల్లికూడా అక్కడ ఉంది. )

అమ్మాయి తండ్రి : బావగారూ! ఇవి చేతులు కావు! దయచేసి ఈ ముచ్చట కాస్త జరిగి పోనివ్వండి. అమ్మాయి కాపరానికి వచ్చే లోపల మీ డబ్బు పువ్వుల్లో పెట్టి తీసుకొచ్చి మీ పాదాల దగ్గర పెడతాను. నన్నునమ్మండి.

అత్తగారు : ( బుగ్గలు నొక్కుకుంటూ ) బావుంది వరస! ముహూర్తం నాటికైనా అణా పైసల్తో తెచ్చిస్తానంటూ ఆ రోజున ముహూర్తం పెట్టించి, తీరా ఇప్పు డిలా మొండి చెయ్యి చూపిస్తావా? పెళ్ళికొడుకులు కావాలంటే తేరగా దొరకరు! నేనేమో నవమాసాలూ మోసి కని పెంచాను. ఆయన గారేమో రెక్కలు ముక్కలు చేసుకుని చదివించారు. వూరికే ఎగరేసుకు పోదా మనుకుంటున్నావ్ కాబోలు! ( భర్తతో ) ఏమండీ అలా బెల్లం కొట్టిన రాయిలా ఉంటారే— చెప్పండీ!

మావగారు : అవునవును!, అలా వీల్లేదు.

అమ్మాయి తండ్రి : ముహూర్తం సమయానికి డబ్బు అందచేయాలనే ప్రయత్నించాను, అక్కయ్యగారూ! తీరా ఈ ఇల్లు కొంటానన్న పెద్దమనిషి— సమయానికి మొండిచెయ్యి చూపించాడు.

అత్తగారు : ఒహో! అందుకని మీరు మాకు మొండిచెయ్యి చూపిస్తున్నారన్న మాట! చూడండీ, ఇస్తామన్న పదివేల కట్నం, రెండువేల లాంఛనాలూ ఈ క్షణంలో తెచ్చి మా చేతిలో పోస్తేనే— మా అబ్బాయి, మీ అమ్మాయి మెళ్ళో మూడు ముళ్ళు వేస్తాడు. అంతే !(భర్తతో) ఏమండీ.. అలా బెల్లం కొట్టిన రాయిలా ఉంటారే—చెప్పండీ...

మావగారు : అవునవును! అంతే! అలా వీల్లేదు!

అమ్మాయితండ్రి : ఇలా అర్థాంతరంగా పీటల మీద పెళ్ళి ఆగిపోతే —మా పరువేం కావాలి, బావగారూ. నా మాట మన్నించండి. ఈ శుభకార్యం జరిగి పోనివ్వండి! అంతగా మీకు కావాలంటే ఇప్పుడే ఈ క్షణంలోనే ఈ ఇల్లు మీ పేరున రాసిస్తాను.

అత్తగారు : ఎందుకూ? అక్కణ్ణించీ రేపు వూర్లో నలుగురూ — 'మీకు నీడ లేకుండా చేశాం' అని మమ్మల్ని ఆడిపోసుకోటానికా? ఇదంతా అనవసరం. ఈ విశాపట్నం విశాలాక్షిది ఒక్కటే మాట! ముహూర్తానికి ఇంకా అరగంట వ్యవధి ఉంది. ఈ లోగా పన్నెండు వేలూ తెచ్చారా సరేసరి. లేకపోతే మా అబ్బాయి మీ పిల్ల మెడలో తాళి కట్టడం జరగదు. ఇంకా అరగంటే టైముంది. ఏం చేస్తారో మీ ఇష్టం. అంతవరకూ మేం విడిదిలో ఉంటాం. రా రా. అబ్బాయ్! ( పెళ్ళికొడుకుని లాక్కుని వెళ్ళిపోతూ, అక్కడే నిలబడి ఉన్న భర్తను చూసింది. (ఆగి) ఇంకా అక్కడే నిలబడ్డా రేమిటండీ ... బెల్లం కొట్టిన రాయిలా! పదండి!



మావగారు : అవునవును....( అంటూ భార్యనూ, కొడుకునూ అనుసరించాడు.)

అమ్మాయితల్లి : (కళ్ళల్లో నీళ్ళు కదులుతూంటే ) అమ్మా ... అయిపోయిందమ్మా. అంతా అయిపోయింది. సర్వనాశనం అయిపో యింది... ( అంటూ బరువుగా, నెమ్మదిగా కూతురి వైపు నడుస్తూంటే ఆమె కూడా లేచి కన్నీటితో తండ్రిని చేరుకుంటుంది. )

అమ్మాయి : నాన్నా ... (ఇద్దరూ కౌగలించుకున్నారు. తండ్రి భుజం మీద తల పెట్టుకుని దుఃఖిస్తున్న ఆమె కొన్ని క్షణాల్లో జ రిగిందేమిటో తెలుసుకుంది )నాన్నా ...!( అంటూ భయంగా తండ్రి వైపుచూసింది. అప్పటికే మరణించిన ఆ తండ్రి కుప్పలా కూలిపోయాడు. ) నా...న్నా...!

( ఆమె అలా ఏడుస్తూంటే నెమ్మదిగా లైట్స్ ఫేడవుట్ అయ్యాయి. మళ్ళీ నెమ్మదిగా లైట్స్ ఫేడిన్ అయ్యేసరికి ఇపుడు శంకరం ముందు దీనంగా నిలబడి ఉంది. )

అమ్మాయి : ఇప్పుడు చెప్పండి, సార్, నన్నేం చెయమంటారు? నాకోసమే నాన్న చచ్చిపోయాడు. నా వల్లనే మా కుటుంబం దిక్కులేనిదైపోయింది. నాకింక ఈ జన్మలో పెళ్ళి కాదు.

శంకరం : కేవలం అందుకోసమే మీ రీ నిర్ణయానికి రావటం నాకు నచ్చలేదు. ఇది పిరికివాళ్ళ లక్షణం.

అమ్మాయి : జరిగిన అవమానాన్ని తల్చుకుని క్రుంగిపోతూ, జీవితాంతం కుటుంబానికి భారంగా బ్రతకటం పిరికితనం. చేజేతులా ప్రాణాలు తీసుకోటం ధైర్యవంతుల లక్షణం.

శంకరం : వో. కే. మీరు చెప్పిందే రైటనుకుందాం. కానీ, నా కో చిన్న అవకాశం ఇప్పించండి. నా ప్రయత్నం నేను చేస్తాను.

అమ్మాయి : అంటే ... ఏం చేస్తారు?

శంకరం : చూస్తారుగా! ( అని వెళ్ళబోతూ, ఆగి ) ఆ ... నేను తిరిగి వచ్చేంత వరకూ మీ రలాంటి అఘాయిత్యం చేయకూడదు. సరేనా? ( ఆమె వైపు చూసి) నాకు తెలుసు. మీ రలాంటి అఘాయిత్యం చేయరు. ఇప్పుడే వస్తాను. అంటూ స్కూటర్ స్టార్ట్‌చేసి, అమ్మాయి ఎటు నించి వచ్చిందో అటువైపు వెళ్ళిపోయాడు. అమ్మాయి స్టేజీ మీద రెండు సార్లు అటూ ఇటూ పచార్లు చేసింది. మళ్ళీ స్కూటరు శబ్దం దూరం నించీ వినిపిస్తూ, ఆ శబ్దం క్రమేపీ దగ్గరయింది. శంకరం వచ్చేశాడు. ఈ సారి అతని వెంట పెళ్ళి కొడుకు ఉన్నాడు. స్కూటరు స్టాండు వేసి, పెళ్ళి కొడుకుని లాక్కుని ఆమె దగ్గరకు తీసుకొచ్చాడు.)

శంకరం : ఈ అమ్మాయి మీకు తెలుసను కుంటాను.

పెండ్లికొడుకు : ( తెలుసు నన్నట్లుగా తల పంకించాడు. )

శంకరం : మీరు చేసిన అవమానం భరించలేక ఈ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకోబోతూంటే, నేనే ఆపేను!

పెండ్లికొడుకు : (తీవ్రంగా ) అయితే నన్నేం చేయమంటారు?

శంకరం : ఆమె తీసుకున్న ఈ దారుణమైన నిర్ణయానికి మీరే కారణమంటున్నాను.

పెండ్లికొడుకు : నేనా?

శంకరం : అవును! మీరూ, మీ నాన్నగారూ!

పెండ్లికొడుకు : నో! ఇందులో కావాలని మేం ఏం చేయలేదు. వాళ్ళ నాన్న ముహూర్తం టైముకి కట్నం డబ్బు తెస్తా నన్నాడు. అందుకే ముహూర్తాలు పెట్టుకున్నాం. తీరా, పీటల మీద కొచ్చినాక, మొండిచెయ్యి చూపించాడు. డబ్బిస్తేనే గానీ పుస్తె కట్టద్దన్నాడు మా నాన్న! తప్పా? ముందే ఆ పేద ఏడుపులు ఏడిస్తే ఈ సంబంధం ఒప్పుకునే వాళ్ళం కాదుగా!

శంకరం : ఛీ ... మూతి మీద మీసం మొలిచిన మగవాడివి! ఇలా తండ్రిచాటు బిడ్డలా, సిగ్గులేకుండా కట్నం కోసం కక్కుర్తిపడి, వో ఆడపిల్ల జీవితంతో చెలగాట మాడతా వనుకోలేదు!

పెండ్లికొడుకు : మీ రనవసరంగా ఆవేశ పడుతున్నారు కానీ, పరిస్థితిని అర్థం చేసుకోవటం లేదు.

శంకరం : ఏమి టా పరిస్థితులు!

పెండ్లికొడుకు : నాక్కూడా పెండ్లి కావలసిన వో చెల్లెలుంది. దానికి పెళ్ళి


చేయాలంటే కట్నం ఇవ్వాలి. ఇప్పటికే నాన్నగారు దానికోసం ఎన్నో సంబంధాలు తీసుకొచ్చారు. కొందరు వేలకు వేలు కట్నం కావాలన్నారు. మరి కొంతమంది 'కట్నం వద్దుగానీ, లాంఛనాలు జరిపి ఘనంగా పెళ్ళి చేయమన్నారు. ఇంకొంతమంది అబ్బాయిగారి ఫారిన్ చదువుకి పెట్టుబడి పెట్టమన్నారు. అన్నింటికీ మూలసూత్రం డబ్బు! మాది కలిగిన కుటుంబం కాదు. ఉన్నదంతా ఖర్చు పెట్టి నాకు చదువు చెప్పించారు. కానీ ఏం లాభం? రెండేళ్ళయి డిగ్రీ తెచ్చుకున్నా, ఉద్యోగం మాత్రం దొరకటం లేదు. కనీసం నాకు ఉద్యోగం దొరికినా, నా సంపాదనతో చెల్లెలు పెళ్ళి చేసేవాణ్ణి. అందుకే నా పెళ్ళి చేసి, నా కొచ్చే కట్నంతో చెల్లాయి పెళ్ళి చేయాలని మా వాళ్ళు నిర్ణయించుకున్నారు. ఈ పరిస్థితుల్లో నన్నేం చేయమంటారు చెప్పండి! కట్నం ఆశించకుండా నా చెల్లెల్ని పెళ్ళి చేసుకునే వాణ్ణి — ఒక్కణ్ణి చూపించండి, అప్పుడు— నేను కూడా కట్నం లేకుండా ఈ అమ్మాయిని చేసుకుంటాను!

శంకరం : (ఆలోచనలో పడ్డాడు. ) ఇది తెగని సమస్య. పరిష్కారం దొరకని సమస్య. ఒకదాంతో మరొకటి గట్టిగా ముడిపడిపోతోంది. ఇప్పుడెలా?... (అంటూ ఆలోచిస్తూ స్టేజి ముందుకు వస్తున్నాడు ) అతను మాట్లాడిన దాంట్లో తప్పు కనిపించటం లేదు. నిజమే. అతని మీద డబ్బు సంపాదిస్తేనే తప్ప — కూతురు పెళ్ళి చేయలేడు తండ్రి. డబ్బిస్తేనే కానీ ఈ పిల్లకు పెళ్ళి కాదు. ( పెళ్ళి కొడుకూ, అమ్మాయి నెమ్మదిగా చెరో వైపు వెళ్ళిపోయారు ) ఎలా? ఈ సమస్యను ఎలా పరిష్కరించటం? ( బుర్ర గోక్కుని, మళ్ళీ ప్రేక్షకులతో అంటు న్నాడు ) ఫ్రెండ్స్! వో చిన్న రిక్వెస్ట్! ఒకదాంతో మరొకటి పెనవేసుకు పోయిన ఈ సమస్యకు అసలు మొదలెక్కడో కనిపెట్టాలి? మీ కేదైనా అయిడియా... ఐ మీన్ ... ఏదైనా పరిష్కారమార్గం కనిపిస్తే నాకు తెలియజేయండి. ఎందుకంటే మీ అభిప్రాయం పైనే—నా పత్రికకు ఇచ్చే రిపోర్టు ఆధారపడి ఉంటుంది. ( ఏదో గుర్తుకు వచ్చిన వాడిలా ) అన్నట్టు రిపోర్టంటే గుర్తొచ్చింది. ఇవాళ కోర్టులో — సీత కేసు వాయిదా ఉంది కదూ. మర్చిపోయాను. (టైం చూసుకుని) అమ్మో... నాలుగు దాటిపోయింది. వెంటనే బయల్దేరితే — అయిదయ్యేలోగా కోర్టుకి చేరవచ్చును. (అంటూ హడావిడిగా స్కూటర్ స్టార్ట్ చేసి బయల్దేరాడు. లైట్లు ఆరిపోయాయి. మళ్ళీ వెంటనే లైట్లు వెలిగేసరికి కోర్టు హాలు కనిపిస్తుంది. జడ్జీగారు కూర్చుని ఉన్నారు. సీత బోన్లో నిలబడి ఉంది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ లేచి నిలబడి, గౌనూ, గొంతూ సవరించుకొని, జడ్జీ ముందుకు వచ్చాడు.)

పబ్లిక్ ప్రాసిక్యూటర్: యువరానర్! నగరంలోని ప్రజలందరినీ భయభ్రాంతుల్ని చేసిన కరుణానిధి హత్య కేసులో అవసరమైన సాక్ష్యులందరినీ విచారించటం పూర్తయింది. ( శంకరం కోర్టు హాల్లోకి వచ్చి ఒక పక్కన నిలబడి చూస్తున్నాడు) అయితే ఈ ముద్దాయి తరపున వాదించేందుకు న్యాయవాది ఎవరూ లేకపోవటం వల్ల ఈమె తన తప్పును ఒప్పుకుంటున్నదనే భావించాలి! నన్నడిగితే ముద్దాయి సీత ఈ సమాజంలో ఉండదగిన వ్యక్తి కాదు. భర్తనే నిర్దాక్షిణ్యంగా హత్య చేసిందంటే ఆమె ఎంతటి కిరాతకురాలో మీరే వూహించండి. ఆడదంటే సహనానికి మారు పేరంటారు! దయా, జాలీ, సానుభూతీ, ప్రేమా, అనురాగం—ఇవన్నీ ఆడదానికి అలంకారాలంటారు. కానీ ఈమెలో మచ్చుకి ఒక్కటైనా లేదు. అతి దారుణంగా ఈమె చేసిన ఈ అమానుష చర్యను మీరూ, నేనూ మన మందరం గర్హించాలి. మొత్తం స్త్రీ జాతికే కళంకం తెచ్చిన ఈ ముద్దాయి సీతకి, ఈ హంతకురాలికి మరణశిక్ష విధించి న్యాయానికి న్యాయం చేకూర్చ వలసిందిగా కోర్టు వారిని ప్రార్థిస్తున్నాను. ( కూర్చున్నాడు )

జడ్జి: ముద్దాయి ఏమైనా చెప్పుకోవాలిసింది ఉందా?

సీత: ఉంది, సార్! నా వల్ల మొత్తం స్త్రీ జాతికి కళంకం వాటిల్లిందని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గారు శెలవిచ్చారు. అందుకు నేను బాధ పడుతున్నాను. అందుకోసమైనా జరిగిందేమిటో జరిగినట్లుగా సిగ్గు విడిచి, కోర్టు వారికి మనవి చేసుకుంటాను. నిజంగా నేను నా చెల్లెళ్ళకీ, అక్కలకీ కళంకం తెచ్చి పెట్టే పని చేసి ఉంటే నన్ను మనస్ఫూర్తిగా క్షమించమని వేడుకుంటున్నాను. కానీ, ఒక చిన్న మనవి!




జడ్జి: ఏమిటది?

సీ: పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గారు చెప్పినట్టు ముందుగా నాకు మరణశిక్ష విధించండి!

జడ్జి: అందరూ బతకాలని కోరుకుంటారు కానీ నీ కోరిక మాకు విచిత్రంగా ఉంది.


సీత: ( విరక్తిగా నవ్వి ) హు! ఈ విచిత్ర లోకంలో—ఇక్కడ ఈ సమాజంలో పుట్టిన నా లాంటి ఆడదానికి ఇలాంటి కోరిక కలగటంలో ఎలాంటి విచిత్రం లేదు, యువరానర్! ఇన్ని రోజులుగా ఈ న్యాయస్థానంలో వాదించిన న్యాయవాదులందరూ నాలో కరుణ లేదనీ, దయ లేదనీ, ప్రేమాభిమానాలు లేనిదాన్ననీ, కట్టుకున్న భర్తనే చంపిన హంతకురాలిననీ బిరుదు లిచ్చారు. చాలా సంతోషం. కానీ, నా గురించి అంత అందంగా చెప్పిన న్యాయవాది గారికే ఒక కూతురో, ఒక చెల్లెలో ఉంటే ఇలాంటి దారుణం ఆమె చేసి ఉంటే అప్పు డెలా వాదించేవారో?

జడ్జి: అంటే. నువ్ చేసిన పనిని సమర్థించుకోవాలని చూస్తున్నావా?

సీత: ( నవ్వి ) అలా అయితే మరణశిక్ష విధించమని మరోసారి కోరేదాన్ని కాదు, యువరానర్! అయినా సమర్థించు కోవాలిసిన అవసరం, సమాధానం చెప్పుకోవలసిన అగత్యం నాకు లేవు. నేను చెప్పే నాలుగు మాటలూ మీ హృదయాన్ని కరిగించి నాకు శిక్ష తప్పిస్తాయనీ ఆశా నాకు లేదు. కానీ, ఇవాల్టి సమాజంలో కొంతమంది మగ రాక్షసులు తమ భార్యల పట్ల ఎంత క్రూరంగా ప్రవర్తిస్తున్నారో కోర్టు వారికి మనవి చేసుకోవాలని ఉంది. 'స్త్రీ స్వాతంత్ర్యం', 'స్త్రీ గౌరవం' అనే పెద్ద పెద్ద మాటలు ఒక వైపు ఉపయోగిస్తూనే, మరో వైపు ఆ స్త్రీని ఒక ఆట వస్తువుగా భావించి తమ అవసరాలకూ వాడుకునే కొంతమంది కిరాతకుల నైజాన్ని బట్ట బయలు చేయాలని ఉంది.

జడ్జి: అంటే, నీ భర్త నిన్ను అలా హింసించి నందువల్లనే, అతన్ని హత్య చేశానంటావ్. అంతే కదూ?

సీత: యస్, యువరానర్! దాంపత్య జీవితం గురించి నే నెన్నో అందమైన కలలు కన్నాను. వయసుతో పాటె వూహల్ని పెంచుకున్నాను. ఆ వూహల్నీ, కలల్నీ నిజం చేసుకోగలననే నమ్మకంతో అత్తవారింట అడుగు పెట్టాను. కానీ నిజ జీవితంలో నే నెంత మోస పోయానో తొలి రోజునే తెలుసుకున్నాను. నా భర్త ఒట్టి తాగుబోతు. సంఘంలో పెద్ద మనుషులుగా చెలామణీ అవుతున్న వ్యక్తు లెందరో మా అత్తగారి కోసం వస్తూండే వారు. క్రమేపీ ఆవిడ గురించి అర్థం చేసుకో గలిగాను. ఒక్కొక్క రోజున ఒక్కొక్కరితో పట్టపగలే గడిపేది. నాకు అసహ్యం వేసేది. అయినా నా బతుకు నేను బతకటానికి వీల్లేకుండా పోయింది. ఒక రోజు చీకటి పడుతున్న వేళకు ఆయన ఇంటి కొచ్చారు. ( ఇప్పుడు లైట్లు ఫేడవుట్ అవుతున్నాయి. వెనకగా సీత భర్త సైడ్ వింగ్ లోంచి రావటం కనిపిస్తూంది ) ఎప్పటి లాగే పీకల దాకా తాగి మరీ వచ్చాడు.




సీత భర్త: సీతా. సీతా! ( లైట్లు నెమ్మదిగా ఫేడిన్ అవుతున్నాయి ) మై డియర్ సీతా! త్వరగా రావాలి.

తల్లి: ఎందుకూ? సీత వంట చేస్తూంది. ఏం కావాలి? ( అంటూ వచ్చింది )

సీత భర్త: సీతకి ఇదిగో... మల్లె పూలు తెచ్చానమ్మా. తెల్ల చీరకూడా. తెచ్చాను.

తల్లి: సిగ్గు లేకపోతే సరి! మల్లె పూలూ, తెల్ల చీరా తెచ్చాట్ట!

సీత భర్త: అమ్మా. . .

తల్లి: వాళ్ళ బాబు నీకు స్కూటరు కొనిస్తానని చెప్పి మూడేళ్ళయింది. అదొచ్చే దాకా ఇలాంటి సరదాలు పనికి రావని చెప్పాను!

సీత భర్త: ప్చ్. ప్చ్! ఈ సరదా నా కోసం కాదమ్మా! మా ఆఫీసు మేనేజరు పరశురాం లేడూ ఆయన—ఆయన కోసం!

తల్లి: ( అర్థంకాక ) అంటే. . .

సీత భర్త: ( నవ్వేసి ) మరేం లేదమ్మా. ఆయన సీతను చూడ్డానికి వస్తానన్నాడు. మరి సీత అందంగా కనిపించాలిగా! అందుకని!

తల్లి: ( ఏదో అర్థంచేసుకునేందుకు ప్రయత్నిస్తూంది ) సరే. నేను గుళ్ళోకి వెళ్ళొస్తాను. తలుపులు జాగ్రత్త! ( అంటూ హాండ్ బాగ్ తీసుకుని వెళ్ళిపోయింది )

సీత భర్త: సీతా! త్వరగా రావాలి! టైం లేదు.

సీత: ( వస్తూ ) ఏమిటీ. . .

సీత భర్త: ఇదిగో నీ కోసం ఏం తెచ్చానో చూడు! తెల్ల చీర, మల్లె పూలు... త్వరగా ముస్తాబవ్వాలి!

సీత: మీరు. మీరు... నాకు మల్లె పూలు తెచ్చారా?

సీత భర్త: ( గుండెలు బాదుకుంటూ ) యస్. నేనే... నేనే తెచ్చాను! రేపటి నించీ ప్రమోషన్ వచ్చిందంటే రోజూ మల్లె పూలు, నెల కో తెల్ల చీర, ఏడాది కో పట్టు చీర! కమాన్! త్వరగా కట్టుకో!

సీత: ఇప్పుడే కట్టుకొస్తాను! ( అంటూ లోపలకు వెళ్ళింది )

సీత భర్త: త్వరగా వచ్చెయ్. మళ్ళీ మా బాస్ వస్తాడు. ( అంటూండగానే ఒక నలభై ఏళ్ళ వ్యక్తి లోపలకు వచ్చాడు ) అరె! వచ్చేశారా! రండి, మేనేజరు గారూ! రండి. కూచోండి. నేను మళ్ళీ వస్తాను. సీత లోపల ఉంది. బై! ( అంటూ వెళ్ళబోయి, మళ్ళీ వెనక్కి వచ్చి ) షూర్. రేపు. రేపే నాకు ప్రమోషన్ ఇచ్చేయాలి! లేకపోతే గొడవ. గొడవయి పోతుంది! ( అంటూ వెళ్ళిపోయాడు )

సీత: ( వస్తూ ) ఏవండీ. ( మేనేజర్ని చూసి కొంచెం ఖంగారు పడి ) మీరు. మీరూ. . . .

మేనేజరు: నేను నేనే! మీ ఆయనకి ఆఫీసులో బాసుని! ఇక్కడ నీకు దాసాను దాసుణ్ణి.

సీత: ( కోపంగా ) ఏమిటి మీ రనేది?

మేనేజరు: నీ కర్థం కాలేదంటే నేను నమ్మను! మీ ఆయన ప్రమోషన్ కావాలన్నాడు. నాకు నువ్వు కావాలన్నాను. దట్సాల్! అనాది కాలంలో బార్టర్ సిస్టం అనీ ఒకటుండేది. నా దగ్గ రున్నది నీ కిచ్చి, నా క్కావలసిందాన్ని నీ దగ్గరినుంచి పుచ్చుకోవటం అన్నమాట! ( అంటూ చెయ్యి పుచ్చుకోబోయాడు )

సీత: ఛీ. దుర్మార్గుడా! ఇంట్లో ఎవరూ లేకుండా చూసి ( దూరంగా చూస్తూ ) ఏవండీ. . .

మేనేజరు: ( నవ్వుతూ-) మీ 'ఏమండీ' గారే నన్ను రమ్మన్నారండీ. నీ మొగుడికి ఆఫీసులో ప్రమోషన్ కావాలి! అదీ నే నిస్తున్నా. నాకు సుఖం కావాలి! అది ను వ్విస్తున్నావ్. జస్ట్ ఎక్స్ చేంజ. దట్సాల్.!

సీత: ( అర్థం చేసుకుని ) అంటే నా భర్త నిన్ను... ఛీ. ఛీ! ( దూరంగా జరిగింది )

మేనేజరు: ( మీద కొస్తూ ) రెండేళ్ళ క్రితం మీ పెళ్ళిలో నిన్ను చూశాను. రంభలాంటి నిన్ను కట్టుకున్న నీ మొగుడు అదృష్టవంతు డనుకున్నాను. ఇప్పు డా అదృష్టాన్ని నాకు పంచుతాననీ నీ మొగుడే అంటూంటే కాదన గలనా?

సీత: ( గదిలో మూల ఇనపకడ్డీ కనిపించింది. హఠాత్తుగా దాన్ని తీసుకుని ) ఆగు! అడుగు ముందుకు వేశావంటే తల పగిలి పోతుంది!

మేనేజరు: ( ఆగిపోయి ) అంతకు తెగించా వన్నమాట! సరే. చూస్తాను. నిన్ను కాదు. నీ మొగుడి అంతు చూస్తాను. లోపలకు రాగానే తెల్ల చీరా, మల్లె పూలతో ఎదురొచ్చి ఒళ్ళో వాలుతుందని చెప్పాడు. స్టుపిడ్! ( అంటూ వెళ్ళిపోయాడు )

సీత: ( తల్లో పూలచెండు తీసి విసిరి కొట్టి, చేతుల్లో ముఖాన్ని దాచుకుని ఏడుస్తూంది )

సీత భర్త: ( తూలుతూ వచ్చి ) చేసింది చాలక, సిగ్గు లేకుండా ఏడుస్తున్నావా? నా భవిష్యత్తంతా నాశనం చేశావ్ కదే పాపిష్టిదానా!

సీత: హు! భవిష్యత్తు! ( మీద కొస్తూ ) కట్టుకున్న ఇల్లాల్ని పరాయి వాడికి తార్చి మీ భవిష్యత్తు మార్చుకోవాలనుకోవటం ఎంత నీచమో తెలుసుకో లేక, పైగా నాకు సిగ్గు లేదంటారా?

సీత భర్త: నోర్ముయ్! ఇది పురాణ కాలమూ కాదూ, నువ్వో మహా సాధ్వివీ కాదు. ఒక్కసారి ఆ మేనేజరు గాడి కోరిక తీర్చినంత మాత్రాన నీ పాతివ్రత్యం భంగపడిపోదు.

అత్త: ( వస్తూ ) అబ్బాయ్! నీ పనైందా? ఆ మేనేజరు వచ్చాడా? ( అటూ ఇటూ చూసి) అప్పుడే వెళ్ళిపోయా డన్నమాట. ఇదిగో ప్రసాదం. ( ప్రసాదం పెడుతూ ) ఇంత సే పూ ఆ గుళ్ళో దేవుణ్ణి ప్రార్థిస్తూనే కూర్చున్నా ననుకో—నీకు ప్రమోషన్ రావాలని!

సీత: ( అనుమానంగా ) అంటే. అంటే ఇదంతా మీకూ తెలును నన్నమాట! తెలిసే మీ కొడుకుని మీరు ప్రోత్సహించా రన్నమాట!

అత్త: ఏం? ఇందులో తప్పేముందీ? మీ బాబు మా వాడికి స్కూటరు కోసం పది వేలిస్తా నన్నాడు. ఆ డబ్బు ఇచ్చి ఉంటే అందులో నాలుగు వేలు ఆ మేనేజరుగాడి మొహాన కొట్టి వీడు ప్రొమోషన్ సంపాదించుకునే వాడు. మీ నాన్న ఎలాగా డబ్బివ్వలేదు!.

సీత భర్త: ఆ డబ్బు మీ నాన్న ఇస్తేనేం, నీ శరీరం ఇస్తేనేం? అయ్ వాంట్ మనీ! అయ్ వాంట్ ప్రమోషన్! మర్యాదగా నాతో వచ్చి ఆ మేనేజర్ గారికి క్షమార్పణ చెప్పుకో!

సీత: అది ఈ జన్మలో జరగని పని!

సీత భర్త: జరగదూ? ( ఆమె చెయ్యి పట్టుకుని కాలుతున్న సిగరెట్టును ఆ చేతిపై గుచ్చి ) చెప్పు! ఆయనకు క్షమార్పణ చెబుతావా చెప్పవా?

సీత: ( అరుస్తూ ) చెప్పను చెప్పను! చెప్పను! చెప్పను!

సీత భర్త: ( వికటంగా నవ్వుతూ ) నీ చేత ఎలా చెప్పించాలో నాకు బాగా తెలుసు. ( అంటూ సిగరెట్టుతో ఆమె శరీరంపై ఒకటి రెండు చోట్ల కాలుస్తాడు )

అత్త: ( పక్కనించి కిరోసిన్ డబ్బా తీసి కొడు క్కిస్తూ ) ఇదిగో! ఈ కిరసనాయిలు దాని నెత్తిన పోసి, ఒక అగ్గిపుల్ల గియ్. పీడా పోతుంది!

సీత భర్త: ( కిరసనాయిలు డబ్బా తీసుకుని, ఆమెపై పోయబోతూండగా

సీత: ( ఇనప కడ్డీ తీసుకుని ) ఆగు! ( అంటూ దాన్ని పైకెత్తి అతని మీదకు వస్తూంటే అత్తగారూ, భర్తా శిలాప్రతిమల్లా నిలబడి పోయారు. లైట్లు పూర్తిగా ఫేడవుట్ అయిపోయాయి! మళ్ళీ లైట్లు వెలిగేసరికి కోర్టులో జడ్జీగారు కూర్చుని ఉన్నారు. శంకరం, పబ్లిక్ ప్రాసిక్యూటరూకూడా తమ తమ స్థానాల్లో కనిపిస్తున్నారు. బోనులో సీత నిలబడి ఉంది )

( ఆవేశంగా ) ఆ మనుషుల్లో వెర్రితల లెత్తిన నీచత్వాన్నిచూసేసరికి నాలో రక్తం ఉడికిపోయింది. ఆవేశం కట్టలు తెంచుకుంది. ఒక్క ఉదుటున ఆయన మీద చీ. చీ. ఆయనేమిటి. వాడి మీదఆదుర్మార్గుడి మీద విరుచుకు పడి నా చేతిలో ఉన్న ఇనప కడ్డీతో చావ బాదేను. కాదు, కావాలనే చంపేశాను. నాలో దయ లేదు ( ఏడుపు వస్తూంటే ) కరుణ లేదు, ప్రేమ లేదు. నేను కిరాతకురాల్ని. సమాజానికి పట్టిన చీడపురుగుని! నాకు ఉరిశిక్ష వేయండి, యువరానర్! నన్ను చంపేయండి! నాకు ఉరిశిక్ష వేయండి! ( బోనులో కుప్పలా కూలిపోయింది )

( జడ్జిగారూ, ప్లీడరుగారూ నెమ్మదిగా తల వంచుకుని వెళ్ళిపోయారు. వెళ్ళే ముందు జడ్జీగారు కాగితం మీద ఏదో రాసి, బల్లమీద పెట్టి మరీ వెళ్ళారు. శంకరం నెమ్మదిగా అటు వేళ్ళాడు. ఆ కాగితం తీసి చదివాడు. తరవాత పక్కనున్న టెలిఫోను తీసి, ఏదో నంబరు డయల్ చేశాడు. )

శంకరం ( రిసీవర్‌లో మాట్లాడుతూ ) హలో...ఎడిటర్‌గారేనాండీ? నమస్తే, సార్! నేనూ, శంకరాన్ని. రిపోర్టర్ శంకరాన్నండీ. కోర్టులోంచి ఫోన్ చేస్తున్నాను. అదే చెబుతున్నాను. రాసుకోండి, సార్! 'ఒకమ్మాయి చావా లనుకుంది. మరో అమ్మాయి 'నన్ను చంపేయండీ—నాకు ఉరిశిక్ష విధించండీ' అంటూ కోర్టు వారిని కోరుకుంది. ఇద్దరిదీ ఒకటే కోరిక. ఆ కోరికతో పెనవేసుకున్నది ఒకటే సమస్య. అన్నట్టు మరో విశేషం. సీత కేసు చూస్తున్న జడ్జిగారు న్యాయం చెప్పటానికి ధైర్యం చాలక ఇంతకు ముందే శెలవు పెట్టేసి వెళ్ళిపోయారు! యస్. వివరాలు వచ్చి చెబుతాను! ఉంటాను! ( రిసీవర్ పెట్టేసి, ప్రేక్షకులతో అంటున్నాడు ) వెల్! దిసీజ్ ది ఫేట్ ఆఫ్ అవర్ విమెన్! నో! అవర్ సిస్టర్స్! ఆల్‌రైట్. ఇంటికి బయలుదేరవచ్చు! ( అంటూండగా లైట్స్ ఫేడవుట్ అయిపోయాయి. శంకరం తన స్కూటరు ఎక్కి స్టార్ట్ చేశాడు. నెమ్మదిగా లైట్లు మళ్ళీ ఫేడిన్ అవుతూండగా శంకరం స్కూటరు మీద ప్రయాణం చేస్తున్నాడు. నేపథ్యంలో స్కూటరు శబ్దం వినిపిస్తూంది. అంతలో ఒక మూల ఒక అమ్మాయి కనిపించింది, ఆమె వెనకాల యువకుడు ఈల వేసుకుంటూ వచ్చాడు. అతను ఆ అమ్మాయిని ఏదో అడిగాడు. ఆ అమ్మాయి హొయలు ఒలక బోస్తూ బదులు చెప్పింది. వాళ్ళ సంభాషణంతా మైమ్‌లోనే నడిచింది. చివరికి ఆ పిల్ల ఆ యువకుణ్ణి తన ఇంటికి తీసుకెళ్ళింది. శంకరం తన స్కూటర్‌కి స్టాండ్ వేసి, వాళ్ళను అనుసరించాడు. ముందు యువకుడు లోపలకు వెళ్ళిపోయాడు. అతని వెనకనే వెళ్ళిపోతున్న ఆమె చెయ్యి పట్టుకున్నాడు శంకరం! )

శంకరం: ఆగు!


ఆమె: ఏం పిల్లాడా? ఏమిటి కథ? ఒళ్ళెలా ఉందేమిటీ?

శంకరం: ఇప్పటిదాకా బాగానే ఉంది! కానీ, నిన్ను చూసిం తరవాత అసహ్యంతో నిండిపోయింది. ఛీ. ఛీ. సిగ్గు లేదూ ఈ పని చేయటానికీ?

ఆమె: ( పక పకా నవ్వి ) సిగ్గెందుకూ? కోటి విద్యలూ కూటి కోసమే అన్నారు. అయినా అసలు నువ్వెవరు? రచయితవా? సంఘ సంస్కర్తవా? మొదటి వాడు మా గురించి కథలు రాసి, నాలుగుడబ్బులు చేసుకుందామని వస్తాడు. రెండో వాడు ఏదో ఉద్ధరించాలనుకుని, అవకాశం వస్తే ఏ పడవో కొట్టేస్తాడు! నువ్వే బాపతో?

శంకరం: నే నే బాపతూ కాదు! ఈ పాడు పని ఎందుకు చేస్తున్నావో చెప్పు?

ఆమె: 'చేస్తున్నావ్' కాదు! 'చేస్తున్నారు' అనాలి! చూ డబ్బాయ్! బతకడానికి కొందరు తెలివి తేటల్ని అమ్ముకుంటారు. వాడెవడో ఈ మధ్య భార్యనికూడా అమ్మకోవా లనుకున్నాట్ట! నే నేమో ఒళ్ళమ్ము కుంటున్నాను. తప్పా?




( చేయి విదిలించుకుని ) లోపల పేసింజరున్నాడు. టైం వేస్టు చేయకు! ( అంటూ వెళ్ళయింది ).

శంకరం: ( ఆమెను ఆపి బయటకు లాగి ) వీల్లేదు! నా ప్రశ్నలకు సమాధానం కావాలి!

ఆమె: ( విదిల్చి కొట్టి ) అస లెవరయ్యా నువ్వు? నువ్వెందు కడగాలీ, నే నెందుకు చెప్పాలి?

శంకరం: చదువుకున్న దానిలా కనిపిస్తున్నావ్. సంస్కారం, సభ్యతా నీలో ఉండక పోవు! చెప్పు! ఎందుకీ బతుక్కి అలవాటు పడ్డావ్! కేవలం బతకటానికేనా? అయినా ఇలా ఎంత కాలం బతగ్గలవ్? నీ అందం, వయస్సు, శరీరం ఎల్ల కాలం ఇలా ఉంటా యనుకున్నావా? రేపెప్పుడో అవన్నీ పోగొట్టుకున్నాక, రోగాలతో కుళ్ళిపోయి రోడ్డుమీద బిచ్చ మెత్తుకునే పరిస్థితి వస్తుంది. జీవచ్ఛవంలా బతకాల్సి వస్తుంది!

ఆమె: వద్దు! అనవసరంగా భవిష్యత్తును గుర్తు చేసి నన్ను బాధ పెట్టకు. నీకు పుణ్యం ఉంటుంది.

శంకరం: భవిష్యత్తు గురించి అంతగా భయపడే దానివి అస లీ మురికి కూపంలో ఎలా వచ్చావ్?

ఆమె: ( దిగులుగా ) పరిస్థితులు! కుటుంబ పరిస్థితులే నన్నీ రొచ్చులోకి లాగేశాయ్.

శంకరం: అంటే పాపిష్ఠి డబ్బు కోసం పవిత్రమైన శీలాన్ని అమ్ముకుంటున్నా వన్నమాట!

ఆమె: ( భయంతో ) లేదు. ఆ ఉద్దేశ్యం ముందు నాకు లేదు. ( గతంలోకి చూస్తూ ) నేనూ ఒక గౌరవమైన కుటుంబంలోనే పుట్టాను. ఇంటికి పెద్దదాన్ని. నా తరవాత ఇంకా చాలా మందున్నారు. నాన్నగారికి చాలీచాలని జీతం. ఇంటి నిండా జనం. ఇంటర్ వరకూ చదువుకున్నాను. ఆ తరవాత చదివించే ఓపిక నాన్నగారికి లేకపోయింది. అందుకే ఇంట్లో నాలు గోడల మధ్యా నవల్సు చదివాను. వీధిలోకి వెళ్ళి అప్పుడప్పుడు సినీమాలు చూశాను. ఆ నవల్లోనూ, సినీమాల్లోనూ కనిపించే హీరోల కోసం వెతికాను. . . అప్పుడే రాజాతో పరిచయమైంది.

శంకరం: రాజా ఎవరూ?

ఆమె: మా ఎదురింటి వాటాలో అద్దె కుండేవాడు. అతని దగ్గర అప్పుడప్పుడు నవల్సు తీసుకుంటూండేదాన్ని. ఆ పరిచయం ప్రేమగా మారింది. అతన్ని చూడకుండా ఒక్క క్షణంకూడా ఉండలేక పోయేదాన్ని. అప్పుడప్పుడు మేం ఇద్దరం పార్కులో కలుసుకుంటూండేవాళ్ళం. ( నెమ్మదిగా లైట్స్ ఫేడవుట్ అయి, మళ్ళీ వెలుతు రొచ్చేసరికి రాజా పార్కులో కూర్చుని ఉన్నాడు. గడ్డి పరకల్ని కొరుకుతూ అసహనంగా అప్పుడప్పుడు టైం చూసుకుంటున్నాడు. వెనక నించి నెమ్మదిగా, దొంగలా వచ్చి ఆమె అతని కళ్ళు మూసింది. )

రాజా: ( విడిపించుకుని ) ఇంత సేపా? నీ కోసం ఎదురు చూడలేక నా కళ్ళు కాయలు కాసిపోతున్నాయి తెలుసా? ఇదిగో ఈ పూలు చూడు! ( మైమ్‌తో పువ్వుల్ని చూపిస్తున్నాడు ) ఎలా బిక్క మొహం వేసుకున్నాయో? గాలికూడా ఉసూరుమంటూ నిట్టూరుస్తూంది.

ఆమె: అబ్బో! అబ్బాయిగారికి కవిత్వంకూడా వచ్చేస్తూందే?


రాజా: (ఆమెను మీదకు లాక్కుని) కవిత్వం కాదు, గిరిజా, నిన్ను చూస్తూంటే—

ఆమె: వూ చూస్తూంటే. ( కొంటెగా నవ్వింది )

రాజారావ్: నీకు వెక్కిరింతగానే కనిపిస్తుంది! ( అంటూ బుంగమూతి పెట్టి అటు తిరిగి కూర్చున్నాడు )

ఆమె: ( అతన్ని తన వైపుకు తిప్పుకుని ) వెక్కిరింత కాదు, రాజా. . . పులకింత! నా వరాల రాజా ఒడిలో ఈ వయసుకి చిగురింత!

రాజారావ్: ఏం లాభం? అసలు వరం ఎప్పుడిస్తావో, ఏమిటో? వూరింతతోటే సరిగిపోతూంది!




ఆమె: అసలు వరం వడ్డీతో సహా ఇచ్చేస్తానుగా!

రాజారావ్: ( ఆశగా ) ఇప్పుడేనా?

ఆమె: ఊహూ! మన పెళ్ళయిం తరవాత!

రాజారావ్: చేసుకుంటానని ప్రామిస్ చేశానుగా!

ఆమె: అంతవరకూ మనం ఆగాలిసిందే! తప్పటడుగు వేయకూడదు.

రాజా: ( ఆలోచించి ) అయితే వచ్చే వారం మళ్ళీ ఇదే రోజున నీ మెళ్ళో మూడు ముళ్ళూ వేసి నా ఒళ్ళో నిన్ను లాలిస్తాను. వచ్చే మంగళవారం ఇదే సమయానికి ఫ్లవర్ ఆంజనేయస్వామి గుడికి వచ్చెయ్! ఆ స్వామి సన్నిధిలో మనం పెళ్ళి చేసుకుని అటునుంచి అటే హైదరాబాద్ చెక్కేద్దాం! ఓ.. కే. .?

( అంటూ అతను ఎడం వైపు వెళ్ళిపోతూంటే ఆమె మళ్ళీ కుడి వైపు నించి నెమ్మదిగా స్టేజి ముందుకు వచ్చి శంకరంతో అంటూంది )

ఆమె: ఆ రాత్రి అమ్మకీ నాన్నకీ నేను పెళ్ళి చేసుకోబోతున్న సంగతి చెప్పాను. మన కులం, మతం కాని వాడితో పెళ్ళి వీల్లేదన్నాడు నాన్న. అమ్మ మొత్తుకుంది. ఇద్దరూ కలిపి ఇంటి పరువు మంట గలవద్దని నన్ను హెచ్చరించారు. అంతేకానీ, ఎదిగిన పిల్లకు పెళ్ళి చేయాలనే ఆలోచన మాత్రం రాలేదు! అవును మరి! పెళ్ళి చేయాలంటే కట్నం కావాలి! వేలకు వేలు కట్నం పోసి నాన్న ఎలాగూ నా పెళ్ళి చేయలేడని నాకు తెలుసు. చివరికి నన్ను ఒదుల్చు కోవటానికి ఏ ముసలాడో పెళ్ళి వాడికో అంట గడతాడని వూహించాను. అందుకే తెగించి, వాళ్ళందర్నీ ఒదులుకుని, రాజాతో ఎగిరి పోయాను. అవసరం తీర్చుకున్న తరవాత అతను మళ్ళీ కనిపించకుండా పోయాడు! నాకు మంచి శాస్తి జరిగింది. కానీ ఇందులో నా తప్పేమిటి? ఏమో? తప్పు నాదేనేమో? తెలిసో, తెలియకో చేసిన తప్పుకి ఈ సమాజం నాకు విధించిన శిక్షేమిటో తెలుసా? ఇదే! ఈ బతుకే నాకు శిక్ష! నిజానికి చావలేక బతుకుతున్నాను. అంతే!

శంకరం: ( దిగులుగా ) సారీ. నీ మనసు నొప్పించానేమో?

ఆమె: ( విరక్తిగా నవ్వి ) హు! మనసా? పిచ్చి మనసు! అది ఉందని ఎప్పుడో మరిచిపోయాను. మళ్ళీ మరోసారి గుర్తు చెయ్యకు! వస్తాను. లోపల పేసింజరు నా కోసం చిందులు తొక్కుతుంటాడు. ( అంటూ వెళ్ళిపోయింది )

శంకరం: ( క్షణం సేపు సాలోచనగా ఆమె వైపు చూసి స్కూటరు స్టార్టు చేసి దానిమీద రెండు రౌండ్లు కొట్టి, మళ్ళీ దాన్ని ఒక చోట ఆపి స్టేజి ముందుకు వచ్చాడు. ఇప్పుడు ప్రేక్షకులతో అంటున్నాడు ) ది సీజ 'వన్ ఫాక్ట్ ప్లే' మై డియర్ ఫ్రెండ్స్! చూశారుగా, ఈ వరకట్న దురాచారపు కోరల్లో పడి మన ఆడపడుచులు ఎంతమంది నాశనమై పోతున్నారో? ఈ సమాజంలో వెలిగి పోతున్న సంస్కారం ఇది! మనలో పెల్లుబుకుతున్న ఆదర్శం ఇది! ఈ దేశంలో ఆడపిల్లగా పుట్టినందుకు లభిస్తున్న అమూల్య సంపదలు కన్నీళ్ళూ, ఉరితాళ్ళూ, కాకపోతే కిరసనాయిల డబ్బాలు! ఇందుకు మన మగజాతి సిగ్గు పడాలి! లేదా పరిష్కారాన్ని ఆలోచించాలి. నా క్కావలిసింది ఉపన్యాసాలూ, సానుభూతి వాక్యాలూ కాదు. చేతల్లో పరిష్కారం! నువ్వేం చేస్తావని అడుగుతారా? ఆగండి. చెబుతాను. ( గబా గబా స్టేజిమీద అటు నించి ఇటు నడిచి ఒక వైపు నించి గిరిజను లాక్కుంటూ మళ్ళీ స్టేజి ముందుకు వచ్చాడు )

గిరిజ: ( విదుల్చుకుంటూ) ఏమిటయ్యా. . ఎందు కీ బలాత్కారం? రమ్మంటే వస్తానుగా. నువ్వేదో మంచబ్బాయి వనుకున్నాను! ఇంతా చేస్తే ఇంతేనా? సర్లే. వ్యవహారం తొందరగా తేల్చు! ఇంతకీ ఎంతిస్తావ్?

శంకరం: నా జీవితాన్నిస్తాను!

గిరిజ: ( తెల్లబోయింది ) ఏమిటీ?.

శంకరం: అవును! నిన్ను నా జీవిత భాగస్వామిని చేసుకుంటున్నాను.

గిరిజ: ( ఆశ్చర్యంగా ) అంటే... మీరు.

శంకరం: (గర్వంగా) యస్! ఇకనించి నువ్ గిరిజవు కాదు! మిసెస్ గిరిజా శంకరం! ఇప్పుడే మనం గుడికి వెళ్ళి పెళ్ళిచేసుకుందాం. వన్ మినిట్. ( అంటూ ఒక పక్కన ఉన్న టెలిఫోన్ బూత్‌లోకి వెళ్ళాడు. మైమ్‌తో టెలిఫోన్ డయల్ చేశాడు ) హలో! ఈజిట్ 24846? ఎడిటర్‌గారేనా మాట్లాడేది? నమస్తే, సర్! శంకరాన్ని. 'సెన్సేషనల్ న్యూస్' కావాలన్నారు. దొరికింది. పొద్దున్నే తీసుకొస్తాను. ఓ. కే. సార్! (అంటూ ఫోన్ పెట్టేసి, బయటి కొచ్చి గిరిజ చేయి పట్టుకున్నాడు. సైడ్ వింగ్‌లోకి వెళ్ళిపోతున్న వాడు క్షణం ఆగి మళ్ళీ ప్రేక్షకుల ముందుకు వచ్చి అంటున్నాడు ) మై డియర్ ఫ్రెండ్స్! విషయం మీకు అర్థమైందిగా? మా పెళ్ళికి రాకపోయినా ఫరవాలేదు. మీతో పాటు ఈ సమాజంలో హాయిగా నవ్వుతూ బతకమని ఆశీర్వదించండి! అంతేకానీ, మమ్మల్ని నవ్వులపాలు మాత్రం చేయకండి! ఒక్క మాట. .ఇంటికి వెళ్ళిం తరవాత ఇప్పుడు మీరు చూసిన సంఘటనల గురించి ఒక్క నిమిషం ఆలోచించండి. మీరేమైనా చేయ గలిగితే చేయండి! శెలవ్! ( అంటూ గిరిజను తీసుకుని, వెళ్ళిపోతూంటే నెమ్మదిగా తెర వాలుతుంది. వెనకాల నేపథ్యంలో గుడి గంటలు మోగుతున్నాయి ) ✱